సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 8 । జూలై । 2023



127 మందికి పంటల బీమా

ఉదయగిరి : జిల్లాలో 2022 ఖరీఫ్ సీజన్‌కు పంటల బీమా పథకం కింద 127 మంది రైతులకు రూ.79.80 లక్షలు మంజూరైనట్లు డీఏఓ సుధాకర్‌రాజు తెలిపారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.60,430
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,427
3శాతం జీఎస్టీతో	రూ.5,635
నవర (8గ్రా)	రూ.45,080

గరిష్టం/కనిష్టం
36.5 /29.5

వాతావరణం

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. సాయంత్రం వర్షం కురిసింది. గాలిలో 75 శాతం తేమ ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది.

న్యూస్‌రీల్

మరోసారి ఓడిపోతే సోమిరెడ్డికి జాతీయ అవార్డు

- నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



నెల్లూరు రూరల్ : టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇప్పటివరకు ఐదుసార్లు ఓడిపోయారని, వచ్చే ఎన్నికల్లో ఓడిపోతే జాతీయ స్థాయి అవార్డు ఇస్తామని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. నెల్లూరులోని తన నివాసంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇటీవల జరిగిన టీడీపీ అంతర్గత సమావేశంలో తన గురించి సోమిరెడ్డి చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటన్నారు. టీడీపీని సర్వనాశనం చేసింది సోమిరెడ్డేనని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ నుంచి తిరస్కరించిన వారిని తీసుకోవాల్సిన పరిస్థితి ఆ పార్టీకి ఏర్పడిందన్నారు. కావలిలో టీడీపీకి అభ్యర్థి లేరన్నారు. వచ్చే ఎన్నికల్లో జిల్లాలో టీడీపీకి ఒక్క సీటు కూడా రాదన్నారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తన వల్లే అభివృద్ధి జరిగిందని అసత్య ప్రచారాలు చేసుకుంటున్నారని, రూరల్ బాధ్యతలు తాను చేపట్టిన తర్వాతే రోడ్లు, పలు సమస్యలకు పరిష్కారం లభించిందని గుర్తుచేశారు. సమావేశంలో విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, కార్పొరేటర్లు గౌరీ, మొబీనా, వాసంతి, విజయలక్ష్మి, శ్రీనివాసులురెడ్డి, అవినాష్, విజయభాస్కర్‌రెడ్డి, రైల్వేబోర్డు మెంబర్ వెంకయ్య, నేతలు సురేష్‌రెడ్డి, హరిబాబుయాదవ్, పెంచలరెడ్డి, అబూబకర్, రవి, శ్రీనివాసరావు, మేఘనాథ్‌సింగ్, రియాజ్, జీవన్‌ప్రసాద్ పాల్గొన్నారు.

చేజర్ల అధ్యక్ష, రాపూరు ఉపాధ్యక్షుని ఎన్నిక 13న

నెల్లూరు (పొగతోట): జిల్లాలో ఖాళీగా ఉన్న చేజర్ల మండల పరిషత్ అధ్యక్షుని ఎన్నిక, రాపూరు మండల పరిషత్ ఉపాధ్యక్షుని ఎన్నిక ఈనెల 13న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ చిరంజీవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9న మండల పరిషత్ సభ్యులందరికీ నోటీసులు జారీ చేయాలన్నారు. 13న సమావేశం నిర్వహించి ఎన్నిక ప్రక్రియ పూర్తి చేయాలన్నారు.

అలుపెరుగని అభివృద్ధి ప్రదాత

- ఉచిత విద్యుత్‌తో రైతుల జీవితాల్లో వెలుగులు
- తన భూములు సైతం దానం చేసిన అభినవ వినోబాబావే
- నేడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ జయంతి

పేదల గుండెల్లో మారాజు



దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి పాలన జిల్లా ప్రజానీకానికి స్వర్ణయుగం. ఆయన హయాంలో జిల్లాలోని రిజర్వాయర్ల సామర్థ్యం పెంచడం ద్వారా వ్యవసాయానికి సాగునీరు వచ్చింది. రైతులకు ఉచిత విద్యుత్ వల్ల వారి జీవితాల్లో కొత్త కాంతులు వచ్చాయి. ఫీజు రీయింబర్స్‌మెంటు ద్వారా విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు పడింది. కృష్ణపట్నం పోర్టు, వాటి పరిసరాల్లోని పరిశ్రమల వల్ల యువత ఉపాధికి భరోసా కలిగింది. ఇలా ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపిన వైఎస్సార్ నేటికీ ప్రజల హృదయాల్లో రారాజుగా నిలిచి ఉన్నారు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు/నెల్లూరు(సెంట్రల్): టీడీపీ ప్రభుత్వ హయాంలో వరుసగా కరువు విలయతాండవం చేసింది. అలాంటి పరిస్థితులు స్వయంగా తెలుసుకుని ప్రజలకు భరోసా కల్పించేందుకు అప్పటి ప్రతిపక్ష నేత హోదాలో వైఎస్ రాజశేఖరరెడ్డి 2003 ఏప్రిల్ 9న ప్రజాప్రస్థానం పాదయాత్ర చేపట్టారు. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని చేవెళ్ల నుంచి ఇచ్చాపురం వరకు 1475 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్ర చేశారు. రాజకీయ రంగంలో అప్పటికీ అది సరికొత్త చరిత్రగా విశ్లేషకులు వర్ణిస్తారు. తదుపరి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం దక్కించుకుంది. దాంతో 2004 మే 14న డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణ స్వీకారం చేశారు. జలయజ్ఞం, ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఇందిరాక్రాంతి పథకం, ఇందిర ప్రభ, రాజీవ్ గృహకల్ప, రాజీవ్ యువశక్తి, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర పథకాలను ప్రవేశపెట్టి జనరంజక పాలన అందించారు. రూ.75 మాత్రమే ఉన్న పెన్షన్‌ను రూ.200కు పెంచుతూ, జీతం తీసుకున్నట్లు 1వ తేదీన అందించారు. తద్వారా వృద్ధుల నిరీక్షణకు ఫుల్‌స్టాప్ పెట్టారు. ముస్లిం మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఆయనకే దక్కింది. ఆయన పాలనను మెచ్చి ప్రజలు 2009 శాసనసభ ఎన్నికల్లో విజయాన్ని అప్పగించారు. రెండోమారు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

జిల్లాకు ఐకాన్‌గా పోర్టు

జిల్లాకు దేశంలోనే ఒక పెద్ద ఐకాన్‌గా కృష్ణపట్నం పోర్టు నిలుస్తోంది. అటువంటి పోర్టును జిల్లాకు తీసుకొచ్చిన ఘనత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డిదే. నెల్లూరుకు ఆనుకుని ఉన్న పక్క రాష్ట్రం తమిళనాడులో పోర్టు ఉన్నా నెల్లూరు జిల్లాకు పోర్టు ఉండాలనే లక్ష్యంతో కృష్ణపట్నంలో పోర్టు ఏర్పాటు చేయడంతో జిల్లాకే ఐకాన్‌గా ఇది నిలుస్తోంది. దీని ద్వారా ఎంతో మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు కల్పించారు. ఇక సెజ్‌ల విషయానికి వస్తే ఉమ్మడి జిల్లాలో ఎన్నో సెజ్‌లను తీసుకుని వచ్చి అనేక పరిశ్రమలు జిల్లాకు వచ్చే విధంగా వైఎస్సార్ చొరవ తీసుకోవడం గమనార్హం. ప్రసుతం మహానేత వల్ల ఉమ్మడి జిల్లాలోని అనేక పరిశ్రమల్లో వేలాది మంది ఉద్యోగాలు చేస్తూ ఉపాధి పొందుతున్నారు.

వ్యవసాయానికి ప్రాధాన్యం

నెల్లూరు జిల్లా అంటేనే వ్యవసాయానికి పెట్టింది పేరు. సింహపురిని ధాన్యసిరిగా పిలుస్తుంటారు. అలాంటి జిల్లా రైతాంగానికి మహానేత ఎంతగానో అండగా ఉన్నారు. ప్రధానంగా జిల్లాకు తలమానికంగా ఉన్న సోమశిల రిజర్వాయర్‌పై ప్రత్యేక దృష్టి పెట్టిన ఘనత వైఎస్సార్‌దే. గతంలో రిజర్వాయర్‌లో నీటినిల్వ కేవలం 50 టీఎంసీలు. దానిని మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 72 టీఎంసీలకు పెంచారు. 50 టీఎంసీలు ఉన్న సమయంలో అటు తాగు, ఇటు సాగుకు నీళ్లు చాలక తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఉండేది. 72 టీఎంసీలకు పెంచిన తర్వాత జిల్లాలో రబీ, ఖరీఫ్ రెండు పంటలు పండించుకునే అవకాశం కలిగింది. అనంతరం రిజర్వాయర్ నుంచి నీటి నిల్వలు అధికంగా ఉన్న సమయంలో నీరు వృథాగా పోకుండా ఉండేందుకు జలయజ్ఞంలో భాగంగా సంగం వద్ద ప్రత్యేక బ్యారేజీ, నెల్లూరు వద్ద బ్యారేజీల నిర్మాణానికి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించిన ఘనత కూడా మహానేత వైఎస్సార్‌దే. తరువాతి ప్రభుత్వాలు వాటిని పట్టించుకోకపోయినా, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాటిని పూర్తి చేసి జిల్లా రైతాంగానికి అంకితం చేశారు.

దైవసాక్షిగా ప్రమాణం చేశా

- పారిపోయావెందుకు పులకేశి..
- వెయ్యికోట్ల ఆస్తి ఎక్కడో చూపించు
- లోకేశ్‌పై ఎమ్మెల్యే అనిల్ ఫైర్



వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రమాణం చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు (వీఆర్సీసెంటర్): టీడీపీ నేత లోకేశ్ తనపై చేసిన ఆరోపణలు నిజం కాదంటూ నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ శుక్రవారం దైవసన్నిధిలో ప్రమాణం చేశారు. నగరంలోని వెంటేశ్వరపురంలో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి, లోకేశ్ తనపై వేసిన నిందలు అబద్ధమని దైవసాక్షిగా ప్రమాణం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తనపై ఆరోపణలు చేసి, దేవుడి సన్నిధిలో ప్రమాణం చేయాలని చెప్పిన పులకేశి తోకముడిచి పలాయనం చిత్తగించాడని ఎద్దేవా చేశారు. లోకేశ్ ఆరోపించినట్లు చెన్నూరు వద్ద, సాదావారిపాళెం, అల్లీపురంలలో సెంటు భూమి కూడా తనకు లేదన్నారు. తన తండ్రి నుంచి వచ్చిన 18 ఎకరాల్లో 14 ఎకరాలను రాజకీయాల్లోకి వచ్చిన తరువాత అమ్మేశానని చెప్పారు. తన వివాహ సమయంలో అత్తమామలు తన భార్యకు హైదరాబాద్‌లో ఇచ్చిన 10 సెంట్ల భూమి తప్ప, కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఎక్కడా అంకణం భూమి లేదని తెలిపారు. తనకు వెయ్యి కోట్ల ఆస్తి ఎక్కడ ఉందో లోకేశ్ చూపించాలని సవాల్ చేశారు. తాను సమాధానం చెప్పేది దేవుడికి, నగర ప్రజలకు మాత్రమేనన్నారు. తన ఆస్తులు అమ్మి రాజకీయాల్లో ఉన్నానని తెలిపారు. చంద్రబాబుకు తండ్రి ఖర్జూరనాయుడు రెండెకరాలిస్తే..జూబ్లీహిల్స్‌లో రూ.100 కోట్లతో ఇల్లు ఎలా నిర్మించాడని ప్రశ్నించారు. తనకు, తన తండ్రికి 70 ఎకరాల భూములున్నాయని, దేవుడి సన్నిధిలో ఈ వివరాలను ప్రజలకు చెప్పే అవకాశం వచ్చిందని పేర్కొన్నారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ ఖలీల్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

సోమశిలలో 27.816 టీఎంసీలు

చేజర్ల(సోమశిల) : సోమశిల జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 27.816 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి వరద ప్రవాహం లేదు. కాగా పెన్నార్ డెల్టాకు 2,300 క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 280, దక్షిణ కాలువకు 200, కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయంలో 90.943 మీటర్ల నీటిమట్టం నమోదైంది.



నేడు రైతు దినోత్సవం

నెల్లూరు(సెంట్రల్) : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు దినోత్సవాన్ని శనివారం అట్టహాసంగా నిర్వహించనున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుధాకర్‌రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని 2019 నుంచి జూలై 8న రైతు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఈ ఏడాది కూడా ఉదయగిరిలో జిల్లాస్థాయి రైతు దినోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 2022 ఏడాదికి సంబంధించి ఖరీఫ్ సీజన్‌కు జిల్లాలో మొత్తం 127 మంది రైతులకు రూ.79,80,386 డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా నగదును ఆయా రైతుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు.

అవినీతికి పరాకాష్ట.. పోలంరెడ్డి



కోవూరులో తవ్వేకొద్దీ పచ్చ పాపాలు

- టీడీపీ హయాంలోనే భారీ కుంభకోణాలు
- రూ.కోట్లలో కొల్లగొట్టిన నేతను పక్కనే పెట్టుకుని ప్రసన్నపై లోకేశ్ పసలేని విమర్శలు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు/కోవూరు: కోవూరు నియోజకవర్గంలో గత టీడీపీ పాలన అక్రమాలకు అడ్డాగా మారింది. పంట పొలాలు, ఇరిగేషన్ భూములు, సముద్రతీరం, పెన్నాతీరం, మలిదేవి డ్రెయిన్, శ్మశానవాటికలనూ అప్పటి టీడీపీ నేతలు వదిలిపెట్టలేదు. ఆ ఐదేళ్ల కాలంలో ఎమ్మెల్యేగా ఉన్న పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అక్రమాలపై చీటింగ్ కేసులు, కోర్టు సమన్లు కూడా ఎన్నో వచ్చిన దాఖలాలున్నాయి. అంతటి పాపాల పుట్టను వదిలి లోకేశ్ యువగళంలో స్థానిక ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిపై పసలేని ఆరోపణలు చేయడంపై నియోజకవర్గ ప్రజలు నివ్వెరపోతున్నారు. పాపాలన్నీ ఆ పార్టీవారే చేసి సంక్షేమాన్ని చేరువ చేస్తూ సొంత నిధులతో సేవ చేస్తున్న స్థానిక ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డిపై ఆరోపణలు చేసి మరోసారి ప్రజల్లో చులకన అయ్యాడన్న ఆరోపణలున్నాయి.

టీడీపీ హయాంలో అనేక అక్రమాలు

జిల్లాలో ఇరిగేషన్ శాఖను పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి కనుసైగతో నడిపించాడు. ఆ సమయంలో కలెక్టర్ నుంచి రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం వరకు ఎన్నో విచారణలు, సమన్లు అందుకున్నారు. లెక్కకు మించి, లేని పనులకు సైతం టెండర్లు తెచ్చి మరీ వాటిని తన అనుచరుల పేరుతో నామినేషన్లు వేయించి పర్సంటేజీలు దిగమింగిన ఘన చరిత్ర మూటగట్టుకున్నాడు. కొన్ని సందర్భాల్లో తానే బినామీ పేర్లతో పనులు చేయించి అప్పనంగా సొమ్ములు నొక్కేశారన్న ఆరోపణలు వినిపించాయి.

దళితుల పొట్టకొట్టి..

విడవలూరు మండలం ఊటుకూరు గ్రామంలో దళితులు సాగు చేసుకుంటున్న 90.86 ఎకరాల భూమిపై అప్పటి ప్రజాప్రతినిధి కన్నేశారు. అందుకు సర్వే నంబరు 1284, 1287, 1288 మొదలు దాదాపు 14 సర్వే నంబర్లలో ఎకరాను సుమారు రూ.3.50 లక్షల నుంచి రూ.4 లక్షలకు కొనుగోలు చేయించి వాటిని ల్యాండ్ పర్చేజ్ స్కీమ్ కింద ప్రభుత్వానికి ఎకరాను రూ.10 లక్షలకు విక్రయించి నాటి ప్రభుత్వాన్ని సుమారు రూ.5 కోట్ల నుంచి 6 కోట్ల వరకు మోసం చేశారనే ఆరోపణలు వినిపించాయి. అలాగే సమీప ప్రాంతంలో ఎంత భూమి ఉన్నా కేవలం ఆయన కనుసన్నల్లో ఉన్న భూములు మాత్రమే 'ఎల్పీఎస్' స్కీమ్ కింద తన అధికార బలంతో కొనుగోలు చేయించి ప్రభుత్వ ఖజానాకు రూ.లక్షలు గండికొట్టారన్న ఆరోపణలున్నాయి.

రైతుల పక్షాన నిలువకుండా..

రామతీర్థం సముద్రతీరాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం గతంలో నిధులు మంజూరు చేసింది. ఈ క్రమంలో ఆ ప్రాంతం పక్కన సమీప బంధువుల పేరుతో సుమారు ఏడు ఎకరాలు స్వాహా చేశారని ఆయన అనుచరులే బాహాటంగా ఆరోపించి అవినీతి దందాను వెలుగులోకి తీసుకురావడం విశేషం. 'ఇఫ్కో'కు సంబంధించి 3,350 ఎకరాల భూమిలో సుమారు 250 ఎకరాల భూమికి ఇఫ్కో పరిహారం చెల్లించింది. ఈ క్రమంలో మిగిలిన భూమికి సంబంధించి రైతుల పక్షాన మాట్లాడకుండా ఉండేందుకు సుమారు రూ.3 కోట్ల ప్యాకేజీ ముట్టిందన్న ప్రచారం ఉంది.

అన్ని పనుల్లో అక్రమ సంపాదనే

నీరు–చెట్టు, ఎన్‌ఆర్‌ఈజీఎస్, వరద సహాయక ప్యాకేజీ పనులు, పెన్నాడెల్టా కాలువ ప్యాకేజీ పనులు, మలిదేవి డ్రెయిన్ పనులు, వ్యవసాయ శాఖలో ట్రాక్టర్ల కేటాయింపులు తదితర అంశాలపై అప్పటి కలెక్టర్, జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, చివరకు లోకాయుక్త, హైకోర్టులో అనేక కేసుల విచారణలు కొనసాగాయి. ఆ కాలంలో నియోజకవర్గంలోని కొడవలూరు, బుచ్చిరెడ్డిపాళెం, విడవలూరు, ఇందుకూరుపేట, కోవూరు మండలాల్లో సుమారు రూ.100 కోట్లు అక్రమంగా దోచుకున్నారని ఆధారాలతో సహా అధికారులకు నిరూపించారు.

తెలంగాణలోనూ..

తెలంగాణ రాష్ట్రంలో కూడా పోలంరెడ్డికి అక్రమాల చిట్టా ఉంది. ఘట్‌కేసర్‌లో రియల్ దందాను నిర్వహించి అక్కడ ఎందరో టీడీపీ నేతలను మోసం చేసి ఆస్తులు కూడబెట్టారని అక్కడి పోలీస్‌స్టేషన్‌లో 2001 మార్చి 5వ తేదీన సెక్షన్ 447, 427ల కింద కేసు నమోదైనట్లు ప్రచారం ఉంది. శ్రీనిధి హోమ్స్ బాగోతం వెలుగు చూసే క్రమంలో 'జాయ్.. ఎంజాయ్' పేరిట ఆనాడు ఆ సంస్థకు మేనేజింగ్ డైరెక్టర్‌గా మనీ సర్క్యులేషన్ సంస్థను ప్రారంభించారు. తమ సంస్థలో డబ్బులు కట్టిన వారికి ప్లాట్లు ఇస్తామని నమ్మబలికి ఎందరినో నట్టేట ముంచి కోట్లాది రూపాయలు వసూలు చేయడం నాడు సంచలనంగా మారింది. అందుకు సంబంధించి విజయవాడ సత్యనారాయణపురం పోలీస్‌స్టేషన్‌లో బాధితులు చీటింగ్ కేసులు నమోదు చేశారు. 2014 ఎన్నికల్లో కోవూరు ఎన్నికల అధికారికి ఇచ్చిన అఫిడవిట్ లోనూ, రెండు కేసులకు సంబంధించి ఆధారాలు చూపించారు.

- అవినీతి చరిత్ర ఉన్న నేతలను పక్కన పెట్టుకుని స్థానిక ఎమ్మెల్యేపై ఆరోపణలు చేసిన లోకేశ్‌పై ఆపార్టీ కేడర్ అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. గురివింద సామెత గుర్తుకు తెచ్చేలా వ్యవహరిస్తున్న చినబాబు తీరును జిల్లా వాసులు ఛీదరించుకుంటున్నారు.

జనం లేక.. నిరుత్సాహంగా..



పాదయాత్ర ప్రారంభంలో మండపం వద్ద పలుచగా ఉన్న జనం

- డబ్బులిచ్చినా చివరి వరకు ఉండని జనాలు
- మరోసారి అంబేడ్కర్‌ను విస్మరించిన వైనం
- పైగా అక్కడే లోకేశ్‌కు సన్మానం

కొడవలూరు: లోకేశ్ యువగళం పాదయాత్ర మండల పరిధిలో నిరుత్సాహంగా సాగింది. డబ్బిచ్చి జనాన్ని తరలించినా ఆరంభంలోనే జనం పలుచగా ఉండడం గమనార్హం. యువగళం పాదయాత్ర గురువారం రాత్రి కొడవలూరు మండలం నార్తురాజుపాళేనికి చేరింది. యథావిధిగా శుక్రవారం సాయంత్రం 4 గంటలకు పాదయాత్ర బయల్దేరాల్సి ఉండగా, జనం లేకపోవడంతో అరగంట ఆలస్యంగా ఆరంభించారు. అప్పటికీ జనం ఆశించిన స్థాయిలో రాలేదు. దీంతో కొడవలూరు రైల్వేగేటు వరకు కూడా పాదయాత్ర నీరసంగా సాగింది.

విమర్శలకు తావిస్తోన్న చినబాబు తీరు

పాదయాత్రలో టీడీపీ నేతలు, సెక్యూరిటీ సిబ్బంది మినహా జనం అరకొరగానే కనిపించారు. నార్తురాజుపాళెం బస్టాండ్ కూడలి మీదుగానే పాదయాత్ర సాగినప్పటికీ అక్కడే ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించకపోగా, అక్కడే లోకేశ్‌కు గజమాల వేయడం విమర్శలకు తావిచ్చింది. లోకేశ్‌కు దళితులపై ఉన్న గౌరవం ఇదేనా అని పలువురు బాహాటంగానే చర్చించుకున్నారు. పోలంరెడ్డి స్వగ్రామమైన నార్తురాజుపాళెంలో ఇలాంటి చర్యలకు పాల్పడడంతో చినబాబు తీరు ప్రజల్లో తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

క్లుప్తంగా

కిలో పొగాకు @ రూ.245



డీసీపల్లి వేలం కేంద్రానికి రైతులు తీసుకొచ్చిన పొగాకు బేళ్లు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం డీసీపల్లిలోని పొగాకు బోర్డు వేలం కేంద్రంలో రైతుల వద్ద ఉన్న అదనపు నిల్వల పొగాకు కొనుగోళ్లను శుక్రవారం ప్రారంభించారు. మర్రిపాడు క్లస్టర్‌కు చెందిన రైతులు 498 బేళ్లు వేలం కేంద్రానికి తీసుకురాగా 461 బేళ్లను కొనుగోలు చేశారు. 37 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకుకు అత్యధిక ధర రూ.245 పలికింది. అత్యల్ప ధర రూ.161, సగటు ధర రూ.234.44 నమోదైంది. ఈ సందర్భంగా వేలం కేంద్రం నిర్వహణాధికారి జి.రాజశేఖర్ రైతులతో మాట్లాడుతూ ఎలాంటి అపరాధ రుసుము లేకుండా రైతుల పొగాకు నిల్వలను వేలం కేంద్రంలో కొనుగోలు చేస్తామన్నారు.

ఎండీయూ వాహనంలో విజిలెన్స్ తనిఖీలు

- రూ.23 వేల విలువ చేసే బియ్యం, చక్కెర సీజ్

నెల్లూరు(క్రైమ్): నెల్లూరులోని పడారుపల్లి మాస్టర్‌కాలనీ వద్ద ఎండీయూ వాహనంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పౌరసరఫరాలశాఖ అధికారుల బృందం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి బియ్యం, చక్కెర మోతాదుకి మించి వ్యత్యాసాలు ఉండడంతో సీజ్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. పడారుపల్లి ప్రాంతంలో ప్రజలకు పంపిణీ చేయాల్సిన నిత్యావసరాలు పక్కదోవ పడుతున్నాయని అందిన ఫిర్యాదుల మేరకు విజిలెన్స్, పౌరసరఫరాలశాఖ అధికారుల బృందం ఈ నెల 6వ తేదీ రాత్రి పడారుపల్లి మాస్టర్స్‌కాలనీ ప్రాంతంలో ఎండీయూ వాహనాన్ని తనిఖీ చేశారు. వాహనంలో ఈ–పాస్ ప్రకారం 116 కేజీల బియ్యం ఉండాల్సి ఉండగా అదనంగా మరో 557 కేజీలు, 100 ప్యాకెట్ల చెక్కరకు గాను 60 ప్యాకెట్లు మాత్రమే ఉండటాన్ని అధికారులు గుర్తించారు. దీంతో వాహన ఆపరేటర్ గంగాధర్‌ను అధికారులు వ్యత్యాసాలపై విచారించారు. బియ్యం అవసరం లేని లబ్ధిదారుల వద్ద నుంచి కేజీ రూ.10లకు కొనుగోలు చేసి హోటల్స్, పిండిమిల్లు వారికి రూ.15 చొప్పున విక్రయిస్తున్నట్లు గంగాధర్ అధికారులకు వెల్లడించాడు. దీంతో వాహనంలోని రూ.23,133 విలువ చేసే 673 కేజీల బియ్యం, 60 ప్యాకెట్ల చక్కెరను, ఎండీయూ వాహనం, ఈ–పాస్ మిషన్‌ను అధికారులు సీజ్ చేశారు. ఈ మేరకు నెల్లూరురూరల్ మండల పౌరసరఫరాలశాఖ డిప్యూటీ తహసీల్దార్ డానియల్ పీటర్‌రావు, వేదాయపాళెం పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆపరేటర్‌పై చీటింగ్, 7ఆఫ్ ఈసీ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు.

దిశకు ఫిర్యాదు.. ఆగిన మైనర్ వివాహం

ఆత్మకూరు: ఓ మైనర్ బాలికకు ఇష్టంలేకుండా వివాహం చేస్తున్నారని దిశ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందడంతో గంటల వ్యవధిలో దర్యాప్తు చేసి ఆ వివాహాన్ని అడ్డుకున్న ఘటన ఆత్మకూరులో శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఆత్మకూరు, ఏఎస్‌పేట ఎస్సైలు కె.ముత్యాలరావు, ఎస్.నరేష్ వివరాల మేరకు ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని టిడ్కో భవనాల్లో నివాసం ఉంటున్న అరుణమ్మ అనే మహిళకు 16 సంవత్సరాల కుమార్తె ఉంది. అరుణమ్మకు భర్తతో విభేదాలు ఉండడంతో అతను ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. ఈ నేపథ్యంలో మైనర్ అయిన తన కుమార్తెకు వివాహం చేయాలని ఏఎస్‌పేట మండలం చౌటభీమవరానికి చెందిన సమీప బంధువు తిరుమల అనే వ్యక్తితో వివాహం నిశ్చయించారు. శుక్రవారం తెల్లవారుజామున చౌటభీమవరంలో వివాహం నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో బాలికకు సన్నిహితంగా ఉండే ఒక మహిళ దిశ పోలీస్‌స్టేషన్‌కు ఈ విషయమై ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న నెల్లూరు దిశ పోలీసు అధికారులు ఆత్మకూరు, ఏఎస్‌పేట పోలీసులను అప్రమత్తం చేశారు. ఏఎస్‌పేట ఎస్సై నరేష్ చౌటభీమవరం గ్రామానికి చేరుకొని విచారణ చేసి పెళ్లి నిలుపుదల చేశారు. ఆ బాలికను, తల్లిని ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు. దీంతో ఆ బాలిక పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది.

రేపు నూతన కోర్టు భవనాల ప్రారంభం

నెల్లూరు(లీగల్): నెల్లూరు జిల్లా కోర్టు ఆవరణలో నూతనంగా నిర్మించిన భవనాలను ఆదివారం ఉదయం 10 గంటలకు ఏపీ హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్ శేషసాయి ప్రారంభిస్తారని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.యామిని, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.ఉమామహేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హైకోర్టు న్యాయమూర్తితో పాటు నెల్లూరు జిల్లా అడ్మినిస్ట్రేషన్ జడ్జి జస్టిస్ డి.రమేష్ పాల్గొంటారని తెలిపారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 117
లేయర్ (లైవ్)	: 100
బ్రాయిలర్ చికెన్	: 206
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 230
లేయర్ చికెన్	: 170



నక్కలగండిలో మత్స్యసంపద దోపిడీ

ఓ వ్యాపారి రూ.లక్షల విలువ చేసే మత్స్యసంపదను అక్రమంగా కొల్లగొడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నాడు. ఈ వ్యవహారం మత్స్యశాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. ఇందులో పెద్ద మొత్తంలో అధికారులు ముడుపులు తీసుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ తంతు జిల్లా సరిహద్దులో ఉన్న వరికుంటపాడు మండలం నక్కలగండి రిజర్వాయర్‌లో జరుగుతోంది.

- అక్రమంగా చేపలు పడుతున్న పామూరుకు చెందిన వ్యాపారి
- చేపలు పట్టుకునేందుకు రిజర్వాయర్ నీరు దిగువకు విడుదల
- మత్స్యశాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోని వైనం

ఉదయగిరి/వరికుంటపాడు: గత మూడేళ్లుగా వర్షాలు బాగా కురుస్తుండడంతో వరికుంటపాడు మండలం నక్కలగండి రిజర్వాయర్‌లో నీరు పుష్కలంగా ఉంది. 1200 ఎకరాల ఆయకట్టు గల ఈ రిజర్వాయర్ పరిధిలో నీరు సమృద్ధిగా ఉండడంతో సమీప ప్రాంతాల్లో భూగర్భజలాలు కూడా వృద్ధి చెందాయి. బోర్లు, బావుల్లో నీరు పుష్కలంగా ఉండడంతో రైతులు పంటలు సాగు చేసుకుంటున్నారు. వేసవిలో కూడా నీటి సమస్య రాలేదు. అయితే ఇందులో చేపల పెంపకంతోపాటు వాటిని పట్టుకొనే హక్కులను ప్రభుత్వం గతంలో మత్స్యసొసైటీకి ఇచ్చింది. ఈ మత్స్యసొసైటీలో సభ్యులుగా ఉన్న చుట్టుపక్కల గ్రామాలకు చెందిన యానాదులు రిజర్వాయర్‌లో చేప పిల్లలు వేసి పెంచుతున్నారు. ఆ చేప పిల్లలు పెద్దయ్యాక పామూరుకు చెందిన ఓ చేపల వ్యాపారి వారికి బినామీగా వ్యవహరిస్తూ వారికి కొంత మొత్తం ఇచ్చి మిగతా వ్యవహారాన్ని తానే నిర్వహిస్తున్నాడు. ఈ తంతు గత కొన్నేళ్లుగా సాగుతోంది. అయితే రెండేళ్ల కితం సొసైటీని ప్రభుత్వం రద్దు చేసింది. రిజర్వాయర్‌లో ఉన్న చేపలను బహిరంగవేలం వేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో సొసైటీ వారు హైకోర్టుకు వెళ్లి వేలం వేయకుండా మధ్యంతర ఉత్తర్వులు తెచ్చుకున్నారు. దీంతో వేలం పాట నిలిచిపోయింది. ఈ వ్యవహారమంతా చేపల వ్యాపారి నడిపించినట్లు ఆరోపణలున్నాయి.



నక్కలగండి రిజర్వాయర్ వద్ద ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న రైతులు (ఫైల్)

గుట్టుచప్పుడు కాకుండా..

గతేడాది చేపల వ్యాపారి అధికారులను మేనేజ్ చేసి రాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా చేపలు పట్టి రూ.లక్షలు గడించాడు. నీరు ఎక్కువగా ఉండడంతో పూర్తి స్థాయిలో చేపలు పట్టేందుకు వీలుకాలేదు. దీంతో మత్స్యసంపద ఈ ఏడాదికి బాగా వృద్ధి చెందింది. సుమారు రూ.1.5 కోట్ల మేర మత్స్యసంపద రిజర్వాయర్‌లో ఉంటుందని అంచనా. దీంతో సదరు వ్యాపారి ఈ ఏడాది పూర్తిస్థాయిలో మత్స్యసంపదను పట్టేందుకు ప్రణాళిక వేసుకున్నాడు. రెండు నెలల నుంచి గుట్టుచప్పుడు కాకుండా రాత్రి వేళల్లో అతని ఆధ్వర్యంలో చేపలు పడుతున్నారు. రిజర్వాయర్‌లో నీరు ఎక్కువగా ఉండడంతో పూర్తిస్థాయిలో చేపలు పట్టేందుకు వీలుకాలేదు. ఈ క్రమంలో రాత్రి వేళల్లో రిజర్వాయర్ షెట్టర్లు ఎత్తి వేసి నీటిని దిగువకు వదులుతున్నారు. దీంతో రిజర్వాయర్‌లోని నీరు వేగంగా దిగువకు వెళ్లిపోతుండడంతో చేపలు పట్టుకునేందుకు అనుకూలంగా మారింది. అయితే రిజర్వాయర్‌లోని నీరు వదిలివేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

చేపలు పడితే కఠిన చర్యలు

ప్రస్తుతం రిజర్వాయర్లలో చేపల వేట నిషేధం ఉంది. నక్కలగండిలో ఎవరూ చేపలు పట్టకుండా తగిన చర్యలు తీసుకుంటాం. ఎవరైనా పట్టుపడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం.

– నాగేశ్వరరావు, జేడీ, మత్స్యశాఖ

నీరు వదిలితే కేసులు నమోదు చేస్తాం



నక్కలగండి రిజర్వాయర్ గేట్లు ఎత్తి నీరు వదిలితే కేసులు నమోదు చేస్తాం. గేట్లు ఎత్తకుండా సిబ్బందిని కాపలాగా ఏర్పాటు చేశాం. రాత్రి వేళల్లో గేట్లు ఎత్తి చేపలు పట్టే వారిపై కూడా చర్యలు తీసుకుంటాం.

– రమణారావు, డీఈ ఇరిగేషన్, వింజమూరు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

- బైక్‌ను ఢీకొన్న కారు
- దువ్వూరు వద్ద అర్ధరాత్రి ఘటన





మృతిచెందిన ఈగా చెంచయ్య, తిరుమలశెట్టి దయాకర్

సంగం: బైక్‌పై వెళుతూ దువ్వూరు వద్ద రోడ్డు ప్రమాదానికి గురై ఇరువురు మృత్యువాత పడిన ఘటన గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. నెల్లూరురూరల్ మండలం కొండ్లపూడి గ్రామానికి చెందిన ఈగా చెంచయ్య(39), తిరుమలశెట్టి దయాకర్(54) వరుసకు అన్నదమ్ములు. కొండ్లపూడిలో నివాసం ఉంటున్న చెంచయ్యకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇతను బొగ్గు వ్యాపారం చేస్తూ ఇటీవల చేపల వేట సాగిస్తున్నాడు. ఆత్మకూరులో నివాసం ఉంటున్న దయాకర్ కూలి పనులు చేసుకుంటూ గురువారం కొండ్లపూడిలోని తమ్ముడి వద్దకు వచ్చాడు. రాత్రి కావడంతో చెంచయ్య.. దయాకర్‌ను బైక్‌పై ఎక్కించుకుని ఆత్మకూరులో వదిలేందుకు వెళుతుండగా దువ్వూరు వద్ద ఆత్మకూరు వైపు నుంచి వస్తున్న కారు వేగంగా వీరి బైక్‌ను ఢీకొంది. దీంతో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. వాహనదారులు 108 వాహనానికి సమాచారం ఇచ్చి చికిత్సనిమిత్తం వారిని బుచ్చిరెడ్డిపాళెంలోని వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో చెంచయ్య మృతి చెందాడు. దయాకర్ కూడా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. సమాచారం అందుకున్న సంగం ఎస్సై నాగార్జునరెడ్డి బుచ్చిరెడ్డిపాళెంలో ఇరువురి మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అన్నదమ్ములిద్దరూ ఒక్కసారిగా మృతిచెందడంతో ఆ రెండు గిరిజన కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇద్దరి మృతదేహాలను చూసి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

పేదలకు భూములు పంపిణీ చేస్తాం

- జేసీ కూర్మనాథ్

మనుబోలు: జిల్లాలో భూమి లేని పేదలను గుర్తించి వారికి 3,200 ఎకరాలను పంపిణీ చేస్తామని జేసీ కూర్మనాథ్ తెలిపారు. మనుబోలు సచివాలయం–2ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 711 గ్రామాల్లో భూ ముల రీ సర్వే జరుగుతోందన్నారు. వాటిలో 118 గ్రామాల్లో పూర్తయిందని తెలిపారు. 200 చోట్ల గ్రామ సరిహద్దులను (ఓఆర్‌బి) గుర్తించామన్నారు. సర్వే ప్రక్రియ పూర్తయితే రైతులకు సంబంధించిన పట్టా భూములు, ప్రభు త్వ భూములపై స్పష్టత వస్తుందన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఆర్‌ఐ శివప్రసాద్, వీఆర్వో నాగార్జునరెడ్డి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఫ్లైఓవర్ వంతెనపై ఇక రయ్ రయ్



మినీబైపాస్ రోడ్డులోని హరనాథపురం జంక్షన్‌లో నిర్మించిన ఫ్లైఓవర్ వంతెన

- రూ.41.88 కోట్ల అంచనాలతో నిర్మాణ పనులు పూర్తి
- నేడు ప్రజాప్రతినిధులతో ప్రారంభం
- వాహనాల రాకపోకలకు తొలగనున్న ఇబ్బందులు

నెల్లూరు(బారకాసు): ఏపీ సీఎంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక సింహపురి అభివృద్ధి పథంలో ముందుకుసాగుతోంది. నెల్లూరు నగరంలో వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఇప్పటికే మూడు ఫ్లైఓవర్ వంతెనలు నిర్మించగా.. పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని మరో ఫ్లైఓవర్ వంతెనను అత్యాధునిక టెక్నాలజీతో నెల్లూరు నగరంలోని మినీబైపాస్ రోడ్డులో హరనాథపురం కూడలిలో నిర్మించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో ఈ ఫ్లైఓవర్ వంతెన నిర్మాణాన్ని పూర్తి చేశారు. 2020 ఆగస్టులో రూ.41.88 కోట్ల అంచనాలతో ఫ్లైఓవర్ వంతెన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. 2022 ఆగస్టు కల్లా నిర్మాణం పూర్తయ్యేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. అయితే ఓ వైపు కరోనా.. మరోవైపు వర్షాల కారణంగా నిర్మాణ పనుల్లో కొంత ఆలస్యంగా జరిగినప్పటికీ అధికారులు వీలైనంత త్వరగా ఫ్లైఓవర్ వంతెన నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఈ ఫ్లైఓవర్ వంతెనను శనివారం ప్రజాప్రతినిధుల చేతులమీదుగా ప్రారంభించనున్నారు. ఇకపై ఫ్లైఓవర్ వంతెనపై వాహనాలు రయ్ రయ్‌మంటూ పరుగులు తీస్తాయి.

త్వరలో కాలువలు, కల్వర్టుల నిర్మాణాలు

ఫ్లైఓవర్ వంతెనకు ఇరువైపులా కాలువలు, కల్వర్టులు, అప్రోచ్ రోడ్ల నిర్మాణ పనులు త్వరలో చేపట్టనున్నారు. ఈ పనులను 20 రోజుల లోపు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఫ్లైఓవర్ వంతెన నిర్మాణ విషయంలో నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అధికారులకు తగు సూచనలు చేస్తూ వచ్చారు. అలాగే వాహనాదారులు, ప్రజలు రాకపోకలు సాగించేలా జాతీయ రహదారుల అధికారులు, పోలీస్ అధికారులు చర్యలు తీసుకున్నారు.

ఇకపై ట్రాఫిక్ ఇక్కట్లు ఉండవు



మినీబైపాస్ రోడ్డులో ఫ్లైఓవర్ వంతెన నిర్మాణం కరోనా, వర్షాలు తదితర కారణాలతో కొంత ఆలస్యమైనప్పటికీ పూర్తి చేయడం జరిగింది. ఇందుకోసం అధికారులు తమవంతు కృషి చేయగా, మరో వైపు ప్రజలు కూడా సహకరించారు. ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయిన క్రమంలో ఇక నుంచి ప్రజలకు ట్రాఫిక్ ఇక్కట్లు ఉండవు. వైఎస్సార్ జయంతి సందర్భంగా ఫ్లైఓవర్ వంతెనను ప్రారంభించుకోవడం ఎంతో సంతోషకరం.

– డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్, నగర ఎమ్మెల్యే

జగనన్న పాలనకు అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు

- వైజాగ్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు సీఎం ఘనతే
- వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆనం జయకుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆనం జయకుమార్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందని, రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల గురించి అధ్యయనం చేసేందుకు ఇతర దేశాల నుంచి కూడా ప్రతినిధులు వస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆనం జయకుమార్‌రెడ్డి తెలిపారు. నెల్లూరు నగరంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజారంజకపాలనకు ఆకర్షితుడినై సీఎం సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరినట్లు తెలిపారు. తనను పార్టీలో చేర్చుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, జిల్లా పెద్దల సహాయ సహకారాలతో నెల్లూరురూరల్, నెల్లూరు సిటీ నియోజకవర్గాలతోపాటు జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. జగనన్న ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి ప్రజల ముంగిటకే సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించడంతోపాటు ధాన్యం కొనుగోళ్లు, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర పథకాలను కూడా అమలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేసిందని తెలిపారు. పేద విద్యార్థులకు మంచి భవిష్యత్ ఇవ్వాలనే లక్ష్యంతో మనబడి నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దారని తెలిపారు. అలాగే అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన, గోరుముద్ద తదితర పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. అలాగే వైజాగ్‌లో ఇన్వెస్టర్స్ సమ్మిట్ ఏర్పాటు చేసి రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకువచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు.

సంక్షేమంలో సరికొత్త చరిత్రకు శ్రీకారం

- కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి



లబ్ధిదారుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

బిట్రగుంట: రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా సరికొత్త చరిత్రకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బోగోలు మండలం చెన్నారాయినిపాళెంలో శుక్రవారం నిర్వహించిన 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని లబ్ధిదారులకు పలు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. స్థానిక సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలన అందిస్తున్నారని తెలిపారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని తెలిపారు. దేశంలో ఇలాంటి సుపరిపాలన మరే రాష్ట్రంలో లేదని స్పష్టం చేశారు. అన్ని అర్హతలు ఉండి సాంకేతిక సమస్యలతో పథకాలు అందకపోతే ఆ లబ్ధిదారులను గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో అధికారులు, సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ తిరిగి వారి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. వీరందరికీ 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పథకాలు అందేందుకు మార్గం సుగమం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గిరి, అధికారులు, స్థానిక నాయకులు, మత్స్యకార కాపులు తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌లో యువకుడి గల్లంతు

ఇందుకూరుపేట: మండలంలోని మైపాడు బీచ్‌లో ఓ యువకుడు గల్లంతైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. తెలంగాణ రాష్ట్రంలోని జనగాం జిల్లా గిరినిగడ్డకు చెందిన మహ్మద్ చాన్(19), 8 మంది బంధువులు, కుటుంబసభ్యులతో కలిసి కారులో నెల్లూరులోని బారాషహీద్ దర్గాకు వచ్చారు. దర్గాను దర్శించుకొన్న అనంతరం తిరుగు ప్రయాణంలో శుక్రవారం సరదగా గడిపేందుకు మైపాడు బీచ్‌కు చేరుకున్నారు. సముద్రంలో మునిగే క్రమంలో మహ్మద్‌చాన్ అలల తాకిడికి గల్లంతయ్యాడు. పక్కనే ఉన్న బంధువు ఏజాజ్.. మహ్మద్‌చాన్‌ను కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న ఎస్సై రాజ్‌కుమార్ హుటాహుటిన బీచ్‌కు చేరుకుని స్థానిక మత్స్యకారులతో కలిసి సముద్రంలో గాలింపు చర్యలు చేపట్టారు. కాగా అప్పటికే చీకటి పడడంతో గాలించడం కొంత కష్టంగా మారింది.